క్లుప్తంగా

శాంతి భద్రతలకు సహకరించాలి

ధరూరు : ఎస్ఐగా సోమవారం బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు మండల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పటేల్ శ్రీనివాసులు, గుడ్డెందొడ్డి నర్సింహులు, ప్రహ్లాద్, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



ఉండవెల్లి : మండలంలోని శేరుపల్లే గ్రామానికి చెందిన శిరీషా(20) అనే వివాహిత ఈనెల 26న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శిరీషా మంగళవారం చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు నెలల క్రితం కులాంతర శిరీషా వనపర్తి జిల్లా దుప్పలి గ్రామానికి చెందిన మధుసూదన్‌తో కులాంతర వివాహం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వీరభద్రస్వామి ఆలయంలో చోరీ

మల్దకల్ : మండల పరధిలోని అమరవాయి గ్రామ వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆలయ అర్చకులు పరమేశ్వరయ్య మంగళవారం తెలిపారు. స్వామి వారి వెండి మీసాలు అపహరించినట్లు, ఇదే తరహాలోనే గతంలో చింతలముని నల్లారెడ్డి స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ధరూరు : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మంగళవారం ధరూరు పీహెచ్‌సీ వైద్యులు స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం సూపర్‌వైజర్ హీర్యా నాయక్ వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. అనంతరం డెటాల్ సబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నర్సింహులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విహారయాత్ర



అలంపూర్ : సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన విద్యార్థుల విహార యాత్ర బృందం మంగళవారం అలంపూర్‌కు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యాగంటి, ఆహోబిలం తదితర పుణ్య క్షేత్రాలను విద్యార్థుల బృందం సందర్శించినట్లు తెలిపారు. జోగుళాంబ ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఆలయాలు మూసివేశారు. దీంతో విద్యార్థులు నిరాశతో వెనుదిరిగారు. అనంతరం బీచుపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం, శ్రీరంగాపురం ఆలయాలను సందర్శించనున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ధరూరు : మద్య తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టు జీరో పాయింట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని హైవే అటాచ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఉండవెల్లికి చెందిన సలీంబాషా అనే వ్యక్తిని మంగళవారం రాత్రి వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన బాషాను 108 అంబులెన్స్‌లో కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలంలో బైక్‌ను అక్కడే వదిలి వాహనదారుడు పరారయ్యాడు.

అంతర్గత రోడ్లకు మహర్దశ



యాపదిన్నెలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ నాగరాజు

శాంతినగర్ : అలంపూర్ నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఆయా గ్రామాల్లోని అంతర్గత రోడ్లు గుంతలమయమై కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామంలో రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు మంజూరు కావడంతో ఇటీవల రోడ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించి రూ.3.08 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రతి గ్రామంలో ఇబ్బందికరంగా మారిన రోడ్లు బాగు పడనుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్ల వివరాలు..

వడ్డేపల్లి మండలానికి సీసీ రోడ్లకు సంబంధించి రూ. 30 లక్షలు 6 రోడ్లు, అలంపూర్ రూ.25 లక్షలు 5 రోడ్లు, అయిజ మండలానికి రూ.85 లక్షలు 17 రోడ్లు, రాజోళి మండలానికి రూ.30 లక్షలు 6 రోడ్లు, ఇటిక్యాల రూ.44 లక్షలు 9 రోడ్లు, ఉండవెల్లి రూ.65 లక్షలు 10 రోడ్లు, మానవపాడు రూ. 29 లక్షలు 6 రోడ్లు మంజూరయ్యాయి.

కొనసాగుతున్న పనులు..

ఆయా గ్రామాలకు మంజూరైన నిధులతో మార్చిలోగా పనులు పూర్తి కావాలని ప్రొసీడింగ్స్ రావడంతో ఆయా గ్రామాలకు చెందిన కాంట్రాక్టర్లు, నాయకులు పనులు మొదలు పెట్టారు. రోడ్ల నిర్మాణలు చేపట్టిన గ్రామాల్లో పనులను ఏఈలు, డీఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. నాణ్యతలో రాజీపడొద్దని సూచిస్తున్నారు.

గుంతలుపడి నీరు నిలిచేది..



మా గ్రామంలో మట్టి రోడ్డుపై గుంతలు పడి వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందికరంగా ఉండేది. పారిశుద్ధ్యంతో తీవ్ర అవస్థలు పడ్డాం. ప్రస్తుతం సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో సంతోషంగా ఉంది.

– జమ్మన్న, యాపదిన్నె, అయిజ

వేగంగా పనులు చేపట్టాలి..



మా గ్రామానికి ఈజీఎస్ పథకం ద్వారా సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఏళ్ల తరబడి గుంతల పడిన రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే సీసీ రోడ్లు పనులు మొదలుపెట్టి ఇబ్బందులు తొలగించాలి.

– ఆర్ఎస్.బీచుపల్లి, రామాపురం, వడ్డేపల్లి

ప్రణాళికలు సిద్ధం చేశాం..

అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించి సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో పనులు చేపట్టారు. నెలరోజుల్లోపు అన్ని పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రహదారులు నిర్మాణాలు చేస్తున్న గ్రామాల్లో ఏఈలు, డీఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

– రెడ్డప్ప, డీఈ, మానవపాడు డివిజన్

దేశంలో శాంతి భద్రతలు క్షీణించాయి



మాట్లాడుతున్న రాంబాబు

ఇటిక్యాల : దేశంలో శాంతి భద్రతలు క్షీణించాయని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వావిలాలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్యాన రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ కార్యదర్శి హత్యను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ.. దేశంలో బహుజన్ సమాజ్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక హత్యలు, దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహనీయుల సిద్ధాంతాలను దేశంలో లేకుండా చేయడానికి భారతీయ జనతా పార్టీ కుట్ర పన్నుతుందన్నారు. హర్బిలాస్ రజ్జుమజర్‌పై దాడి చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కోళ్ల మోహన్ రాజ్, లక్ష్మన్న, వినోద్‌కుమార్, దివాకర్, సురేష్, దుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



అలంపూర్: అయిజ మండలంలోని ఉత్తనూరు గ్రామంలో ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడును నిర్వాహక కమిటీ ఆహ్వానం పలికింది. కర్నూల్‌లోని చల్లా కాంపౌండ్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హనుమంతు రెడ్డి, రామచంద్రారెడ్డి, సమరసింహారెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన



అయిజలో పత్రాలు తగులబెడుతున్న వ్యవసాయ అధికారులు

మానవపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యూపీఎస్, సీపీఎస్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూపీఎస్ దేశ వ్యాప్తంగా అమలుపరిచే విధంగా ఈనెల 24న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీనికి వ్యతిరేకంగా నోపాస్ యూనియన్ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ: మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు మంగళవారం రైతు వేదిక కార్యాలయం ఎదుట యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. యూపీఎస్ విధానానికి సంబంధించిన పత్రాలకు నిప్పుపెట్టి కాల్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ.. యూపీఎస్ విధానం వద్దని, ఓపీసీ విధానం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లోకరాజు, యువరాజు, అనిల్, జయన్న, అరవింద్, స్వాతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానానికి వ్యతిరేకంగా..

ఎర్రవల్లి: మండల పరిధిలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరుతూ పాఠశాల ముందు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కావలి మణ్యం, రవిప్రకాష్, సతీష్, మహమ్మద్, కిరణ్, రత్నకుమారి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మండలాలు ఏర్పాటు చేయాలి

గద్వాలటౌన్ : నియోజకవర్గంలో నూతన రెవెన్యూ మండలాల ఏర్పాటుకు కృషి చేయాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా కన్వీనర్ మోహన్‌రావు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు అచ్చన్నగౌడ్ కోరారు. నూతన మండలాల ఏర్పాటు కోరుతూ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నూతన మండలాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి, ప్రతిపాదనలు పంపాలని ఎంపీ లెటర్ హెడ్‌తో కూడిన ప్రతిని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. బిజ్వారం, ఇందువాసిలతో పాటు గద్వాల మండలంలో రూరల్‌ను పూడూరు రెవెన్యూ మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



అల్వలపాడులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ధరూరు : మండల పరిధిలోని అల్వలపాడు గ్రామ రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేలు జమ కావడంతో గ్రామ తాజా మాజీ సర్పంచ్ వీరన్న గౌడ్ నేతృత్వంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులు, గ్రామ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో తమ గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కృషి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతనిచ్చి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లాలా లజపతిరాయ్‌కు ఘన నివాళి



శాంతినగర్ : మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. మంగళవారం ఘణంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

అయిజ: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల ప్రక్షాళన చేయాలని, అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అవినాష్, నరేష్, దావీదు, సురేష్, సామెల్ పాల్గొన్నారు.

సమాజ సేవకులను విమర్శిస్తే బుద్ధిచెబుతాం

మానవపాడు : ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై అలంపూర్ తాలుకా వైస్‌ప్రెసిడెంట్ గణేష్, మండల యూత్ అధ్యక్షుడు శేఖర్ విమర్శించారు. ఈ సందర్భంగా తన ఆటపాటలతో, సాహిత్యం ద్వారా సమాజానికి సేవలు చేసిన వ్యక్తులను విమర్శిస్తే కాంగ్రెస్ పార్టీ బుద్ధిచెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ నిర్మాణం ఆపే వరకు పోరాటం



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

రాజోళి : మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో ప్రజల్లో ఆందోళన నెలకొందని, దీన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన దీక్షలు ఫ్యాక్టరీ నిర్మాణం నిలిచేంత వరకు ఆగదని స్పష్టం చేశారు. మంగళవారం దీక్షలో భాగంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. పచ్చని పల్లెల్లో ప్రాణాలను హరించే మహమ్మారిని రానివ్వమని నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో పెద్ద ధన్వాడతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పచ్చర్లలో పశువైద్య శిబిరం

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి యజమానులకు పలు సూచనలు ఇచ్చారు. పశువులకు సరైన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మల్లేష్, వరలక్ష్మి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, లతీఫ్, రవి, కార్తీక్, కృష్ణ తదిదరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ టాటాబాబు

అయిజ: జాతర సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని శాంతినగర్ సీఐ టాటాబాబు పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో మండలంలోని ఉత్తనూరు, తొత్తినోనిదొడ్డి గ్రామాల్లో జాతర ఉత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నాయకులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఉత్సవాల్లో బండలాగు పోటీలు నిర్వహించరాదని, పోటీలను నిర్వహించాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఉత్సవాల సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్లు శ్రీనివాసాచారి, జయన్న, ఆంజనేయులు, ఉత్తనూరు, తొత్తినోనిదొడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



అలంపూర్‌లో మాట్లాడుతున్న మస్తాన్ మాదిగ



మల్దకల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్దకల్ : జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు భాస్కర్, చిన్న తిమ్మన్నలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన గద్వాల జిల్లా కేంద్రంలో జరిగే మహా ప్రదర్శనకు అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాకోబు, తిమ్మప్ప, ప్రభాకర్, రాజు, బుచ్చన్న, దేవన్న, నడిపన్న, నాగరాజు, సవారన్న, శంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు విజయవంతం చేద్దాం..

అలంపూర్ : లక్ష డప్పులు...వెయ్యి గొంతుకలు మహా సభ విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ మాదిగ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో మస్తాన్ మాదిగ మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ గద్వాలకు విచ్చేయనున్నట్లు తెలిపారు. లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు మినీ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఈఎఫ్ సంఘాలు, ఎమ్మార్పీఎస్ అనుబంధన సంఘాలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న, జిల్లా నాయకులు ఎలీషా మాదిగ, శీను మాదిగ, పురుషోత్తం మాదిగ, విజయడు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన విజయవంతం చేద్దాం..

గట్టు : లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు మినీ మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న కోరారు. మంగళవారం గట్టులో ఎమ్మార్పీఎస్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసన్న మాట్లాడుతూ.. ఈనెల 30న మందకృష్ణ మాదిగ గద్వాలకు రానున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ తూండేవిడ్, రామునాయుడు, ఈరప్ప, మల్దకల్, బాబు, నర్సింహులు, సంతోష్, జయన్న,తిక్కన్న, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

శాంతినగర్ : బాలికలకు కుటుంబాల్లో సమాన అవకాశాలు కల్పించాలని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. వడ్డేపల్లి మహిళా సమాఖ్య భవనంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాలికలకు రక్షణతో కూడిన విద్యను అందించినప్పుడే వారి హక్కులు పొందుతారన్నారు. ఎంఈఓ నరసింహ మాట్లాడుతూ.. బాలికల మీద ఉన్న వివక్ష తగ్గాలంటే పిల్లల తల్లిదండ్రులకు సమాజానికి బాలికల హక్కుల మీద అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టాస్ కమిటీ ట్రైనర్ శ్రీను, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, రజిత, ఏపీఎం మహేష్, జిల్లా బాలురక్ష భవన్ సభ్యులు ప్రకాష్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, నవీన్, ఎల్లేశ్వరి, శ్రీదేవి, శిరీష పాల్గొన్నారు.

వేసవి సాగులో సరైన మెళకువలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, రైతులు

ఎర్రవల్లి: రైతులు వేసవి సాగులో సరైన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మధిర వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రుక్మిణి సూచించారు. మంగళవారం మండలంలోని పుటాన్‌దొడ్డి రైతు వేదిక నందు జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఆధ్వర్యంలో వేసవిలో రైతులు అధికంగా సాగుచేసే పప్పుదినుసుల పంటలపై రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తక్కువ కాల వ్యవధిలో పండే మినుము, పెసర సాగులో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై ఆమె రైతులకు, వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ముందుగా వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉండే విత్తన రకాలను మాత్రమే ఎన్నుకోవాలన్నారు. విత్తనాల్లో మొలకశాతం 70శాతం కంటే ఎక్కువగా ఉండాలన్నారు. ముఖ్యంగా విత్తన శుద్ధి చేసిన విత్తనాలను మాత్రమే కొనాలన్నారు. లేదా రైతులు సొంతంగా ఇంటి దగ్గరే విత్తన శుద్ధి చేసుకోవాలని, రోగనిరోధక శక్తి కలిగి అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్ రకాలను వాడాలన్నారు. ఒక కిలో విత్తనానికి ట్రైకోడర్మివిరిడి 4గ్రా చొప్పున విత్తనానికి కలిసి శుద్ధి చేయాలని, బిందు, తుంపర్ల సేద్యంలో నీరు పెడితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని సూచించారు. కాయలను సరైన పక్వత ఉన్నప్పుడు కోసి ఆకారం, పరిమాణం, రంగును అనుసరించి మార్కెట్‌కు తరలిస్తే రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్, ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.

వ్యభిచార నిర్వాహకులకు రిమాండ్

గద్వాల క్రైం: పట్టణంలోని బీరోలు చౌరస్తా సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచార దందా నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వహకులను అదుపులోకి తీసుకున్న సంఘటన విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం సదరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల సీఐ శ్రీను తెలిపారు. కడప జిల్లాకు చెందిన రమణయ్యగౌడ్, కేటీదొడ్డి మండలానికి చెందిన వీరేష్‌లు కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలను తీసుకువచ్చి వ్యభిచార దందా నిర్వహిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి గద్వాల కోర్టులో హాజరుపరచి, ఇద్దరు మహిళలను వనపర్తి జిల్లా స్టేట్ హోంకు తరలించగా, నిర్వాహకులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గతేడాది వీరేష్ ఇదే తరహా కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

ఎర్రవల్లి: మండల పరిధిలోని సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్ సయ్యద్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ధరూర్ ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎర్రవల్లి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీడీఓను పలువురు కార్యదర్శులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా త్యాగరాయ ఆరాధన ఉత్సవాలు

అయిజ : మండల కేంద్రంలో మంగళవారం నాయీబ్రాహ్మణ, మంగళ వాయిద్య కళాకారుల సంఘం నాయకులు సద్గురు త్యాగరాయ స్వామి 9వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. త్యాగరాయ స్వామి చిత్రపటాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గోవింద్, మంగళ వాయిద్య కళాకారుల సంఘం నాయకులు మహేష్, నరసింహ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.